


# రాసలీల-ఆనంద హేల

శుకుడు పరీక్షిత్తుతో.. రాజా! మీనము (చేప)ల వలె తళుకులీనే కన్నులు గల ఆ మానవతులు- గోపికలు డెందాలలో అందాల వేడుకలు సందడి చేయగా, వెన్నుని- కృష్ణునికి తమ సన్నని- పలుచని పైట చెరగులచే పీట- ఆసనం కల్పించారు.

**ఆ|| 'పరమయోగి హృదయ భద్ర పీఠంబుల నుండు మేటి వ్రజవధూత్తరీయ పీఠమున వసించి పెంపారె త్రిభువన దేవి లక్ష్మి మేనదేజరిల్ల'**

పరమయోగుల హృదయ పీఠాలపై అధివసించే పరమాత్మ- మధుసూదనుడు, ముల్లోకాల సౌందర్య శోభ తన దివ్య దేహంలో రంగులీనగా, గొల్ల ముద్దియల పయ్యెద కొంగుల శయ్య మీద, ఆ నల్లనయ్య ఆసీనుడయ్యాడు. పైన ఇంచుక కోపంతో, లోన ముంచుకొస్తున్న ప్రేమ తాపంతో పొంకించు- ప్రకాశించు మోములతో ఆ అంచయానలు- హంస గమనలు పంచశర (కామ) జనకుని, పృశ్నిగర్భుని కృష్ణుని ఇలా ప్రశ్నించారు..

'నందనందనా! కొందరు తమను కొలచిన- వలచిన వారినే కొలుస్తారు. మరికొందరు తమ్ము కొలవని వారిని సైతం కొలుస్తారు. ఇంకా కొందరు, ఓ పంకేరుహ నేత్రా! తమను కొలిచే వారినీ, కొలవని వారినీ కూడా కొలవరు, తలవరు. ముకుందా! వీనిలో నీవు ఏ తెగకు చెందిన వాడివో వివరించు?' అందమైన ఈ ప్రశ్నకు మందరగిరి ధరుడు మాధవుడు ఇంకా సుందరంగా సమాధానం చెప్పాడు..

ఇందువదనలారా! ఫలాపేక్షతో పశువులను పోషించునట్లు, కొలిచేవారిని కొలవడం కేవలం స్వార్థమూలకం. అందులో స్నేహం గాని, పరమార్థ రూపమైన పరోపకార ధర్మం కాని ఉండవు. తల్లిదండ్రులు తమ బిడ్డలను వలె, దొడ్డ గుణం కల కొందరు దయామయులు ఏమిస్తారని చూడక ప్రేమించని వారిని కూడా నేమం- నియమంగా ప్రేమిస్తారు. వీరిలో సహృదయత నిండి ఉండటం వలన వీరికి ధర్మ, కామాలనే రెండు పురుషార్థాలూ మెండుగా సిద్ధిస్తాయి. ఇక, ప్రేమించే వారినే ప్రేమించని వారు, ప్రేమించని వారిని ఎలా ప్రేమిస్తారు. చెలువ (సుందరు)లారా! ఇట్టివారు నలుగురు- మొదటి వారు ఆత్మారాములు. ఆత్మయందే రమించు అంతర్ముఖులు. ద్వైత భానమే- ఆత్మకన్న అన్యమైనది ఉన్నదన్న భావమే లేని అవధూత శ్రేణికి చెందినవారు. అలివేణులారా! రెండవ వారు ఆప్తకాములు. భోగవాంఛలు లేని యోగి పుంగవులు. వీరికి ద్వైతం- అనేకత్వం భాసించినా 'వాసుదేవస్సర్వం' అని భేదంలో (అభేద దర్శనం జ్ఞానం) అభేదాన్ని దర్శించగల జ్ఞానులు. చేడియలారా! మూడవ వర్గం వారు అకృతజ్ఞులు. తమ వేడుక- అక్కర తీరగానే జాడ కూడా తెలియకుండా పోయేవారు, ఏరు దాటగానే తెప్ప తగలేసే రకం. ఇక చివరివారు- కొలిచిన వారినే మరువక చెరచువారు, నష్ట పరచువారు. పితృద్రోహం, మిత్రద్రోహం వంటి మేరలేని నేరగాళ్లు. అతి కఠినులు. తరుణీమణులారా! వీనిలో నేను ఏ శ్రేణికి చెందిన వాడను కాను. నేను పరమ కారుణికుడను. మీకు ఆత్మబంధువుణ్ని. నా యెడల మీకు సడలని- ఎడతెగని ధ్యానం కలగడానికే, ఓ కలకంఠులారా! నేను తలగి (మాయమై) పోయాను. అంతేకాని, మీమీద కినుక పూని కానీ, అలగి కానీ కనుమరుగవలేదు. నన్ను ఒకపరి (ఒకసారి) కన్నవారు మదించి ఏమరి- మరచి, ఇక మరి నా వరివస్య- పరిచర్యలు చేయరని మదినెంచి- తలచి, ఆ కనికరం వల్లనే నా రూపు చూపను. పేదవాడు తనకున్న పాటి ధనాన్ని పోగొట్టుకొని, ఘన (భరింపరాని)మైన ఆ చింతనలోనే మునిగిపోయి ఇతరం కననట్లు, నేను కనబడకుండా ఉంటేనే నన్ను కోరువారు నా రూపాన్ని నిరంతరం మననం చేస్తూంటారు.

**త|| 'తగవు ధర్మము జూడ నొల్లక తల్లిదండ్రుల బంధులన్ మగల బిడ్డల బాసి వచ్చిన మన్నిషక్తల మిమ్మునే దగదు, పాసితి దప్పుసైపుడు, తద్వియోగ భరంబునన్ వగల బొందుచు మీర లాడిన వాక్యముల్ వినుచుండితిన్'**

మదిరాక్షులారా! మీ హృదయాలను నా యందు పదిలపరచి, న్యాయమూ ధర్మమూ పాటించక, మీ తల్లిదండ్రులను, భర్తలను, బిడ్డలను, బంధువులను వదలి నా పొందుకు కదలి వచ్చారు. అట్టి మిమ్ము వియోగ వ్యథకు గురిచేసి తలగిపోవుట నాకు తగని పనే! అయినా, అన్నువులారా! నా తప్పును మన్నించండి. నేనగపడక నా విరహంలో వగ (దుఃఖం) పొందుచూ మీరాడిన సెగల మాటలు నేను వింటూనే ఉన్నాను.

**ఉ|| 'పాయని గేహ శృంఖలల బాసి నిరంతర మత్పరత్వముం జేయుచునున్న మీకు బ్రతిసేయ యుగంబులనైన నేర, నన్ బాయక కొల్చు మానసము ప్రత్యుపకారముగా దలించి నా పాయుట దప్పుగా గొనక భామినులార! కృపన్ శమింపరే!'**


'కాంతలారా! ఎంతలేసి విరాగులకైనా విడువరాని సంసారమనే నిగడాల- సంకెళ్లను వీడి నాయందే ఎడతెగని స్వాంతం (మనసు) నిల్పిన మీకు ఎన్ని యుగాల- కల్పాలకైనా నేను ఆసాంతం- పూర్తిగా ప్రత్యుపకారం చేయలేను. మీ రుణం తీర్చుకోలేను. మీ సౌశీల్యం చేతనే నాకు రుణ విముక్తి. నా ప్రత్యుపకార కౌశలం వలన మాత్రం కాదు. మిమ్ము ఎడబాయుట నాకు కృతజ్ఞత లేక కాదు. కడకు అది కూడా, నన్ను మీరు విడువకుండా కొలవడానికే! నేను మీకు కల్పించిన ఈ నిరంతర స్మరణాన్నే ప్రత్యుపకారం- వరణంగా భావించి, మీ నుంచి దైహికంగా దూరమవడాన్ని క్రూరంగా నేరంగా- తప్పుగా తలచబోకండి. నా మీది దయతో, మీ మంచితనంతో ఓర్చుకొని శాంతించండి'. శుకయోగి- రాజా! ఇలా చక్కగా వక్కాణించిన మాధవుని చిక్కని స్నేహ పూరితమైన వాక్కులు విని, ఆయన అక్కున చేరి ఆ ఎలనాగలు- గోపికలు ఎదలో నెలకొన్న దోషబుద్ధిని, వియోగ వ్యథను ఒక్క పెట్టున వదలిపెట్టారు.

**ఉ|| 'ఆ సమయంబునన్ విభుడనంతుడు గృష్ణుడు చిత్రమూర్తియై చేసెను మండల భ్రమణ శీల పరస్పర బద్ధ బాహు కాంతా సువిలాసమున్ బహువిధ స్ఫురితానన హస్త పాద విన్యాసము రాసముం గృత వియచ్చర నేత్ర మనో వికాసమున్'**

ఆ శరత్కాల పున్నమి రేయి అంతటా ఉన్నవాడు, అనంతుడు- దేశ, కాల, వస్తు, పరిచ్ఛేద రహితుడు, ఆత్మారాముడూ అయిన రమారమణుడు అచ్యుతుడు చిత్రాకారుడై రమణీమణులతో రాసక్రీడ సలపడానికి తలపడ్డాడు. వ్రేతలు- గోప నెలతలు గోవిందుని చుట్టూ వృత్తా- వలయాకారంగా నిలిచి 'అన్యోన్యాబద్ధ బాహుభిః'- ఒకరి చేతులు ఒకరు విలాసంగా పట్టుకొని (శ్రీహరి తమను ఏమార్చి- పరధ్యానం కల్గించి, రెండవసారి పారిపోకుండా) తిరిగారు. పలురీతుల స్ఫురించే- ప్రకాశించే (తోచే) ముఖ, హస్త, పాద విన్యాసాలతో ఆ రాస గోష్ఠి భాసిల్లింది. ఆకాశంలో నిలిచి తిలకిస్తున్న దేవతలకు కనువిందై, వారి డెందాలను ఆనందంతో పులకింపజేసింది.

రాసమనగా నర్తకీమణులైన బహుగోపికలతో కలసి నీలమణి కృష్ణుడు లీలగా ఆడిన సంగీత నృత్య విశేషం. పలు పోకడలు పోవనేర్చిన ఆ పురుషోత్తముడు విజృంభించి రాసక్రీడకు పూనుకొన్నాడు. తామర రేకుల నడుమ కర్ణిక- దుద్దువలె గోప భామల మధ్యలో ముద్దుల కృష్ణుడు త్రిభంగియై- మువ్వంపుల సొంపుల మురిపాలతో ఇంపుగా నిలిచాడు. 'కృత్వా తావంత మాత్మానం యావతీర్గోప యోషితః'- ఎందరు గోప సుందరులో, అందరకూ తానే అందరై నాడు. 'అంగనా మంగనా మంతరే మాధవో, మాధవం మాధవం చాంతరేణాంగనా'- 'నారీ నారీ నడుమ మురారీ, హరికీ హరికీ నడుమ వయ్యారి' (సీనియర్ సముద్రాల)- గోపిక పక్క తాను, తన పక్క గోపిక (ఇద్దరు ముద్దరాళ్ల మధ్య మాధవుడు, ఇద్దరు మాధవుల మధ్య ముద్దుగుమ్మ) విలసిల్లే విధంగా నిలిచి వాసుదేవుడు భువన త్రయాన్నీ- అణువణువునూ సమ్మోహన పరచే వేణుగానం చేస్తూ రాసమండలాన్ని భాసిల్ల- ప్రకాశింప జేశాడు. అది వేయి కన్నుల వాసవు- ఇంద్రునికి సయితం విస్మయం గొలిపింది. వేల్పులు సంతోషంతో వినువీధి నుంచి విరుల వాన కురిపించారు.

'మధ్యే మణీనాం హైమానాం మహా మరకతో యథా'- బంగారు మణుల మధ్య రంగారు- (ప్రశస్తమైన వన్నెతో విలాసంగా ఒప్పు), ఇంద్ర నీల మణి వలె భగవంతుడు ఉపేంద్రుడు మిక్కిలి శోభిల్లాడు. అరవిందాల వంటి అతి సుందరాలైన రెండు హస్తాలను తనకు ఇరువంకల ఉన్న ఇగురుబోణు- గోపికల మెడలపై ఉంచాడు. పాటకు అనుగుణంగా ఆశ్చర్యకరంగా అడుగులు వేశాడు. వలయాకృతిలో ఉన్న రాస బంధాలలో భాసమానుడై భవబంధ మోచకుడు వాసుదేవుడు నాట్యమాడాడు. శుభాంగులైన గోపికలందరూ త్రిభంగి మొదలైన భంగిమలతో నిలువగా, వారి బంగారు చిరుగంటల సవ్వడి, మనోజ్ఞాలై పొంగారు- అతిశయించు అందెల రవళి జగత్ జనావళి వీనులకు విందు గావించాయి. గోపాంగనలు అడుగులు, నడుములు, చేతులు, మెడలు ఆడిస్తూ నిక్షేపంగా అనేక అంగ విక్షేపాలు ప్రకటించారు. ఇక్కడ పోతన అమూలకంగా, సాలంకార హావభావ బంధురమైన దీర్ఘ గద్యలో బ్రహ్మానంద సింధు (సాగర) సదృశమైన 'రాసలీల'ను అనాయాసంగా వర్ణిస్తూ అంత్యప్రాసల అందాలతో సందడించే పలు అసదృశ పవిత్ర ఉపమానాలతో సుపవిత్రం చేశాడు.




శుకుడు- రాజా! ఇలా రాసక్రీడ భూమండలాన్నంతా నిండా ఆనందంతో నింపివేసింది. శృంగార రస పయోధిలాగా పొంగారింది. శంకరాభరణాది రాగాలతో సంకులమై శోభించింది. అనురాగ భరితమైన రామరాజ్యంలాగా రమణీయంగా తనరారింది. సదాచారవంతుని సద్వర్తనం- ముదావహమైన నడవడి లాగా అవనీ ఆకాశమండలాలకి మండన (అలంకార)మయింది. గౌరీ నిలయమైన హిమవంతం మాదిరి మహిమావంతమై తేజరిల్లింది. గుణవంతుడైన పుత్రుని వలన కులం ప్రకాశించునట్లు వంశీ విలాసంతో వాసుదేవుని రాసలీల భాసమానమయింది. నానా విధాలైన ప్రబంధాలు కూర్చే కుశలుడైన పోతనవంటి మహాకవి కవితా వనితా శ్రీ విలాసం వలె ప్రకృష్టమైన నాట్యబంధాలతో విలసిల్లింది. (సశేషం)




తంగిరాల రాజేంద్రప్రసాద శర్మ
98668 36006


కథాసుధ

## కావడి బరువు

ఒకానొక గ్రామంలో ఓ రైతు ఉండేవాడు. దేవుడంటే అతనికి వల్లమాలిన భక్తి. ఒకరోజు రైతు కొడుకు తండ్రితో 'ఎప్పుడూ గుళ్లూ గోపురాలూ అంటుంటావు. అసలు భక్తి అంటే ఏమిటి?' అని అడిగాడు. 'సందర్భం వచ్చినప్పుడు సమాధానం చెబుతాన'ని బదులిచ్చాడు రైతు. కొన్ని రోజులు గడిచాయి. ఆడి కృత్తిక నాడు కొండ మీద ఉన్న సుబ్రమణ్యా స్వామికి కావడి పూజ చేసే రోజు రానే వచ్చింది. అటక మీద ఉన్న కావడిని దించమని కొడుకును కోరాడు రైతు. నిచ్చెన వేసుకుని అటక మీద కావడిని దించుతున్న కొడుకుతో రైతు 'కావడి బరువుగా ఉందా?' అని అడిగాడు. 'కొంచెం బరువుగా ఉంది' అని సమాధానం ఇచ్చాడు అబ్బాయి. ఇంట్లో పూజ చేసుకుని కావడిలో పూలు, పండ్లు, ఇతర పూజా సామగ్రి పెట్టుకుని 'హరోం హర!' చెబుతూ తండ్రీకొడుకులు ఇద్దరూ కొండ ఎక్కడం ప్రారంభించారు. ఎంతో ఉత్సాహంగా కొండ మెట్లు ఎక్కుతున్న కొడుకుతో రైతు, 'కావడిలో స్వామికి సమర్పించే వస్తువులు చాలా పెట్టాం. గుడి కూడా కొండపైన ఉంది. చాలా మెట్లు ఎక్కవలసి ఉంది. నీకు కష్టంగా అనిపించడం లేదా?' అని ప్రశ్నించాడు. మెరుపు ముఖంతో 'చాలా తేలికగా ఉంది, ఏమాత్రం బరువు తెలియడం' లేదు అని బదులిచ్చాడు. చిన్నగా నవ్విన రైతు 'అటక మీద నుంచి ఖాళీ కావడిని దించేటప్పుడు నీకు అది బరువుగా తోచింది. ఇప్పుడు అందులో బరువు ఉన్నా, కొండ మెట్లు ఎక్కుతున్నా అదే కావడి నీకు బరువుగా తోచడం లేదు. దీన్నే భక్తి అంటారు. భక్తి భావం వల్ల మనం చేసే పని పట్ల శ్రద్ధ పెరుగుతుంది. క్రమశిక్షణ అలవడుతుంది. ఎంతటి బాధ్యతలనైనా ఇష్టంగా స్వీకరించే సమర్థత కలుగుతుంది. కష్టంగా అనిపించినా ఇష్టంగా చేస్తాం కాబట్టి పని సులభం అవుతుంది. చేరాలనుకున్న గమ్యాన్ని నిశ్చింతగా చేరుకుంటాం' అని వివరించాడు. 'నిజమే, భక్తి భావం మనతో ఎన్నో అద్భుతాలు చేయిస్తుంది' అని తెలుసుకున్నాడు రైతు కొడుకు. కావడి గంటల గణగణ శబ్దాల నడుమ స్వామి వారి దర్శనం చేసుకుని మొక్కుబడి చెల్లించి వెనుదిరిగారు.




.. ఆర్సీ కృష్ణస్వామి రాజు, 93936 62821


## మితాహారం

ఇస్లాం బోధ

ముహమ్మద్ ప్రవక్త (స) కాలంలో మదీనా పట్టణంలో వైద్యులు ఏ పనీపాటా లేకుండా ఉండేవారు. రోగులు రాక గోళ్లు గిల్లుకుంటూ కూర్చునేవారు. ఒకానొక సందర్భంలో వైద్యులంతా కలిసి ముహమ్మద్ ప్రవక్త (స) దగ్గరికి వచ్చి 'మా దగ్గరికి ఒక్క రోగి కూడా రావడం లేద'ని మొరపెట్టుకున్నారు. దానికి ఆయన 'ఇక్కడి ప్రజలు బాగా ఆకలేస్తే తప్ప అన్నం ముట్టుకోరు. కడుపు నిండకముందే తినటం ఆపేస్తారు' అని అన్నారు. 'వాళ్లు ఆరోగ్యవంతులుగా ఉండటానికి కారణం మితాహారం అలవాటేన'ని ప్రవక్త (స) చెప్పారు. ఒకసారి ప్రవక్త అనుచరులు వచ్చి 'ప్రవక్తా! మేం అన్నం తింటున్నాం. కానీ, ఆకలి తీరిన అనుభూతి కలగడం లేదు' అన్నారు. దానికాయన 'మీరు మీ ఇంటివారితో కలిసి భుజించండి. అల్లాహ్ పేరు పలికి తినండి' అన్నారు. అందరూ కలిసి తినడం వల్ల ఇద్దరి అన్నం ముగ్గురికి, ముగ్గురి అన్నం నలుగురికి సరిపోతుంది. కలిసి తినడం వల్ల అందరూ తృప్తిగా భుజించగలుగుతారు. 'సాటి సోదరునికి తినిపించే వారిపై దేవుడి తరపున శుభవార్త అందుతుంది' అని ప్రవక్త (స) సందేశం.


.. ముహమ్మద్ ముజాహిద్, 96406 22076


# అక్కడున్నది సాక్షాత్తూ ఆయనే!

**భగవంతుడంటే మానవజాతి నుంచి వేరుగా, సుదూరంగా ఉండేవాడని కాదు. తన ధామం నుంచి దిగివచ్చి ఈ లోకంలో వివిధ అవతారాలలో మనకు దర్శనమిస్తాడు. తన అవతార ప్రయోజనాన్ని భగవద్గీతలో తానే స్వయంగా వివరించాడు కూడా. శిష్ట రక్షణ, దుష్ట శిక్షణ కోసం తాను యుగయుగంలోనూ అవతరిస్తానని మరీ ప్రకటించాడు. అంతేగాక, మానవజాతి శాంతియుతంగా, సంతోషంగా, సుసంపన్నంగా ఉండేందుకు తగిన ధర్మ సంస్థాపన కూడా గావిస్తాడు.**

భగవంతుడు సర్వశక్తిమంతుడు, సర్వజ్ఞుడు. తన సంకల్ప మాత్రంగా ఏ రూపంలోనైనా లోకంలో అవతరించగలడు. నరసింహుడై స్తంభంలో ఉద్భవించగలడు. బ్రహ్మదేవుడి నాసికా రంధ్రం నుంచి వరాహమూర్తిగా జనించగలడు! తనకు నచ్చిన విధంగా తన భక్తులకు దర్శనమిచ్చి తగిన సేవా భాగ్యాన్ని ప్రసాదించగలిగే సర్వస్వతంత్రుడు ఆ దేవాదిదేవుడు. అలాంటి ఒక రూపమే మందిరంలోని భగవంతుడి అర్చావతారం. దేవాలయంలోని మూర్తి రాతితోనో, లోహంతోనో నిర్మితమైన వస్తువు కాదు. అది సాక్షాత్తూ భగవంతుడే.

### సాకారుడా..? నిరాకారుడా?

పరబ్రహ్మ స్వరూపుడైన దేవదేవుడు మూడు విధాలుగా వ్యక్తమవుతాడని శాస్త్రాలు నిశ్చయంగా నిరూపిస్తున్నాయి. అవి..

1. నిరాకార, వైవిధ్య రహితమైన బ్రహ్మజ్యోతిగా పిలిచే సర్వ వ్యాపకత్వం.
2. ప్రతి జీవి హృదయాంతరంలో కొలువై ఉన్న పరమాత్మ తత్వం.
3. షడైశ్వర్య సంపూర్ణుడై మూర్తీభవించిన భగవత్ తత్త్వం. సకల ఇతర భగవత్ తత్త్వాలకు ఇదే మూలం.

బ్రహ్మజ్యోతికి తానే ఆధారమని భగవద్గీతలో శ్రీకృష్ణుడు వివరించాడు. సకల చరాచర జీవుల హృదయాలలో పరమాత్మగా ఉన్నది తానేనని అందులో చెప్పాడు. భగవద్గీత 12వ అధ్యాయంలో తాను కేవలం సగుణాత్మక ఆరాధన ద్వారా మాత్రమే ప్రసన్నుడనవుతానని శ్రీకృష్ణుడు తెలియజేశాడు.

### ఆలయంలోని అర్చావతారం

దేవాలయంలో అర్చా విగ్రహాన్ని ప్రతిష్ఠించాలంటే ఆగమ శాస్త్ర నియమ నిబంధనలను అనుసరించాలి. శాస్త్రంలో చెప్పినట్టు మొదట స్థపతితో భగవంతుడి విగ్రహాన్ని తయారు చేయించాలి. స్థపతి శిల్ప శాస్త్ర నియమాలను అనుసరిస్తూ శిలతోగానీ, పంచలోహాలను ఉపయోగించి గానీ విగ్రహాన్ని చెక్కుతాడు. సరైన కొలతలు, పరిమాణాలతో రూపాన్ని మలుస్తూ, శాస్త్రాలలో వివరించిన ప్రకారం భగవంతుడి ఆకృతిని తీర్చిదిద్దుతాడు. అలా సిద్ధమైన విగ్రహాన్ని ఆగమ శాస్త్రాలు, పాంచరాత్ర నిబంధనలను అనుసరించి సుముహూర్తంలో ప్రతిష్ఠిస్తారు.

### దైవాన్ని దర్శించుకోవడం ఎలా?

ప్రపంచవ్యాప్త హరేకృష్ణ ఉద్యమ సంస్థాపక ఆచార్యులైన శ్రీల ప్రభుపాదుల వారు ఈ విధంగా వివరించారు. ''భక్తి-సందర్భ' అను గ్రంథంలో ఆచార్య శ్రీల జీవ గోస్వాముల వారు భక్తిమార్గంలో ఉన్న నిష్ఠాగరిష్ఠులైన భక్తులు మట్టి, లోహం, శిల, దారువు (కలప)తో చేసిన భగవంతుడి అర్చా రూపానికి, భగవంతునికి స్వయం రూపానికి మధ్య ఎలాంటి భేదం చూపరని అంటారు. భౌతిక ప్రపంచంలో ఒక వ్యక్తి, అతనికి సంబంధించిన ఛాయా చిత్రం, విగ్రహం మధ్య భేదం ఉంటుంది. అవి వ్యక్తితో భిన్నమైనవి. కానీ, సర్వ సంపూర్ణుడైన భగవంతుడి విషయంలో మాత్రం స్వామికి, స్వామి వారి మూర్తులకు ఎలాంటి భేదమూ ఉండదు. ఒక భక్తుడు ఆలయంలోని మూర్తికి ఏదైనా నివేదిస్తే అది సాక్షాత్తు స్వామికి నివేదించినట్టే. అలా భగవంతుడికి అర్పించిన నైవేద్యాన్ని ప్రసాదంగా స్వీకరించడం ద్వారా భక్తుడు సకల దుఃఖాల నుంచి ఉపశమనం పొందుతాడు' అని పేర్కొన్నారు.



పైన వివరించినట్లుగా, భగవంతుడు తన సంకల్ప మాత్రంగా ఏ రూపంలోనైనా లోకంలో అవతరిస్తాడు. ప్రస్తుత యుగంలో భగవంతుడు శబ్ద రూపంలో అవతరిస్తాడని వేదశాస్త్రాలు వివరిస్తున్నాయి. భగవన్నామ సంకీర్తనంలోని ఆ దివ్య శబ్ద ప్రకంపనలే భగవంతుని స్వరూపం.

**హరే కృష్ణ హరే కృష్ణ, కృష్ణ కృష్ణ హరే హరే**
**హరే రామ హరే రామ, రామ రామ హరే హరే**

ప్రతిరోజూ ఈ మహామంత్రాన్ని జపించడమే ఈ యుగానికి నిర్దేశితమైన అర్చా విధానం.


... శ్రీమాన్ సత్యగౌర చంద్రదాస ప్రభుజీ, 93969 56984


## పరతత్త్వానికి చేరువగా

ఉపనిషత్ వాక్యం

**విద్యాం చావిద్యాం చ యస్త ద్వేదోభయం సహ|**
**అవిద్యయా మృత్యుం తీర్త్వా విద్యయాఽమృత మశ్నుతే||**

(ఈశావాస్య ఉపనిషత్తు)



కర్మ, ఉపాసన... రెండూ ఆచరించదగినవే! కర్మ చేత మృత్యువును జయిస్తాడు. ఉపాసనతో దివ్యత్వాన్ని పొందుతాడు. అవిద్య అంటే కర్మ. విద్య అంటే ఉపాసన. కర్మ ఎక్కువ శాతం శారీరకం. ఉపాసన మానసికం. కర్మచేత పరతత్వాన్ని పొందలేం. దానినే నిష్కామ కర్మగా మలుచుకుంటే ఉపాసనకు సహకరిస్తుంది. పరతత్వాన్ని చేరుస్తుంది. గోదాదేవి చేసిన ధనుర్మాస వ్రతం ఇలాంటిదే! ఆమె మనసంతా కృష్ణుడితోనే నిండి ఉన్నది. అదే ఉపాసన. కానీ, ఆమె కర్మను మానలేదు. వ్రతాన్ని శ్రద్ధాభక్తులతో నెల రోజులు ఆచరించడమే కాకుండా చెలికత్తెలతోనూ ఆచరింపజేసింది. ఇదే నిష్కామ కర్మ. అంటే పరతత్వానికి మరింత సన్నిహితం చేసింది.

గోదాదేవి భూదేవి అంశ. ఆమె సాధకురాలు కాదు. కానీ, సామాన్య సాధకులకు మార్గదర్శకంగా వ్రతాన్ని ఆచరించి చూపించింది.

లోకంలో ఏ కాంతకైనా ప్రియుడు భగవంతుడు కాడు. గోదాదేవి ప్రియుడు మాత్రం భగవంతుడే! అదే విశేషం. మరో విశేషం.. గోదాదేవికి వ్రతాన్ని ఏ గురువూ ఉపదేశించలేదు. రుగ్వేదంలో కాత్యాయని అంటే పార్వతి పరమేశ్వరుడి కోసం ధనుర్మాస వ్రతం చేసిందని చెబుతారు. ద్వాపర యుగంలో శ్రీకృష్ణుడి కోసం గోపికలు వ్రతాన్ని ఆచరించారు. కలియుగంలో విష్ణుచిత్తుడు (పెరియాళ్వారు) భాగవతం దశమ స్కంధం ప్రవచనం చేసేవారు. అదంతా కృష్ణ కథే! గోదాదేవి అప్పుడప్పుడు వినేది. అదీగాక ఇంటికి తరచుగా వేంచేసే వైష్ణవోత్తములను సేవించేది. వారు గోపికల వృత్తాంతాన్ని చర్చించేవారు. గోదాదేవి అవన్నీ వింటూ ప్రేరణ పొందింది. గోపికల వ్రతంలాగా తిరుప్పావై అనే పాశురాలు రోజుకొక్కటిగా 30 రోజులు పాడి, పూమాలగా స్వామికి సమర్పించుకున్నది. ఆమెకు శ్రీవిల్లిపుత్తూరులోని వటపత్రశాయే శ్రీకృష్ణుడు, ఆలయమే నందగోప భవనం, తానున్న పల్లెనే వ్రేపల్లె, చెలికత్తెలే గోపికలు. అలా తన్మయురాలై వ్రతాన్ని ఆచరించి, ఆచరింపజేసి, తరించి, తరింపజేసింది.


... డా|| వెలుదండ సత్యనారాయణ